

# నేనొప్పుకోనంతే

**-సూరేపల్లి విజయ**

నేనొప్పుకోనంతే... పెద్ద కేక వేసి కోపంగా జుట్టు బదులు మీసాలు పీక్కుని మరోసారి కేక వేసాడు యమధర్మరాజు.

ఆ కేకతో హడలిపోయిన చిత్రగుప్తుడు తన ఘంటాన్ని కాస్త వేగంగా కదిలించాడు. ఆ దెబ్బతో పదిహేను మర్డర్లు చేసి ఉరిశిక్ష అనుభవించి, ఆ విధంగా చావాల్సిన ఈ రౌడీషీటర్ ఆయుష్షు బర్‌ర్ ర్‌ర్‌మని మరో పదిహేనేళ్ళకు పెరిగింది.

ప్రభు... గట్టిగా కేక వేయకుము... హడలి.. హడలి ఒళ్ళు వణికిపోవుచున్నది. పాపుల ఆయుష్షు పెరిగిపోవుచున్నది. చిత్రగుప్తుడు కీచుకంఠంతో విన్నవించుకున్నాడు.

యమధర్మరాజు కోపంగా చిత్రగుప్తుడి వంక చూసి 'ఇది అంతయూ నావల్లనే వచ్చినది. నాకొచ్చిన కోపమునకు నా గదతో నీ తల వేయి వ్రక్కలు చేయవలెను. అయినా తమాయించుకొనుచుంటిని... సంతసించుము' అన్నాడు.

చిత్రగుప్తుడు మౌనంగా మళ్ళీ తన చిట్టాల రాత పనిలో పడిపోయాడు.

యమధర్మరాజు మాత్రం భూలోకంలో వున్న బ్రమానందం వంక తీక్షణంగా తన దివ్య దృష్టితో చూస్తూనే వున్నాడు.

యమధర్మరాజుకు ఫ్లాష్‌బ్యాక్ గుర్తొచ్చింది. యుగాల నుంచి దశావతారాలు మొదలునుంచీ దేవుళ్ళు చేస్తోన్న తప్పే, తనూ చేసాడు. తన వాహనమైన దున్నపోతు మెదడు కొద్దిసేపు తనను ఆవహించిందా? ముసలి చిత్రగుప్తుడి చాదస్తపు మాటలు అనను. ప్రలోభపెట్టాయని భూలోకయాన మానవుడి తెలివితేటలు తనని మాయ చేసాయా?

మొత్తం మొత్తంగా అతని మనసు భూతకాలం వైపు పరుగులు తీసింది.

* * *

బ్రమానందం వారం రోజులుగా అడవుల గురించి అన్వేషిస్తూనే వున్నాడు. కాంక్రీట్ జనారణ్యం బాగా డెవలప్ అయింది. అడవులన్నీ నరికివేయబడి కనిపించాయి. పక్క రాష్ట్రానికి వెళ్ళి తపిస్తూ చేద్దామా? అన్న ఆలోచన కూడా వచ్చింది. కానీ సత్యమంగళం అడవుల్లో వీరప్పన్ తనని గుర్తుపడితే... తపిస్తు మాట దేముడెరుగు... వీరప్పన్ తనని కిడ్నాప్ చేసి కిలోమీటర్లకు కిలోమీటర్లు నడిపిస్తాడు. పైగా అతని మూడ్ ఎప్పుడెలా మారుతుందా?

"ఏదో ఒక వీక్ సెకన్... వాడ్ని చంపెయండహ" అని కన్నడంలోనో, తమిళంలోనో అనేస్తే... పాపం ఏ భాష రాని తుపాకి తనని చంపేయదూ...

అందుకే సినిమాలకు పనిచేసే ఓ ఆర్ట్ డైరెక్టర్‌ని పిలిపించి అడవిని పోలిన సెట్టింగ్ వేయించాలని ప్రయత్నించాడు. కానీ దాని బడ్జెట్ ఎక్కువవ్వడంవల్ల చివరాఖరికి ఓ అడవిని దొరకబుచ్చుకొని కాస్త ఎండ, వానల నుంచి రక్షణ యిచ్చే ప్లేస్‌లో తపస్సు మొదలుపెట్టాడు. సేఫ్టీకోసం స్వెట్టరు, రెయిన్‌కోటూ పట్టుకెళ్ళాడు.

* * *


సరే, తపస్సు మొదలైంది. క్యాజువల్‌గా... కామన్‌గా అందర్లా బ్రహ్మ, విష్ణు, మహేశ్వర్ల గురించి తపస్సు చేయలేదు. వాళ్ళెవరైనా ఏవో వరాలిస్తారు. ఏ వరమైనా తను చావక తప్పదు. అసలు తను చావాలంటే యముడు రావాలి. యమపాశం విసరాలి. బోల్డు ప్రాసెస్... అందుకే ఆ యముడ్నే మెప్పిస్తే... అన్న ఓ థాట్ వచ్చి తపస్సు మొదలుపెట్టాడు.

* * *

యముడు అతని తపస్సు గురించి, యూనివర్సల్ చానెల్ అయిన నారదుడి ద్వారా తెలుసుకొని మొదట భయపడి షాకయ్యాడు. తర్వాత ఆశ్చర్యంతో ఫ్రీజయ్యాడు. ఆ తర్వాత ఆనందంతో ప్లీజయ్యాడు.

చిత్రగుప్తుడు సరేసరి... 'మహాప్రభో...మీకెంత భాగ్యం కలిగినది. ఇన్నాళ్ళు మీ గురించి మచ్చుకైనా ఒక్కరైనా తపస్సు చేసారా? ఇదే మంచి అవకాశం. ఆ దేవేంద్రుని పొగరు అణగాలి. వెంటనే వెళ్ళి ప్రత్యక్షం అవ్వండి' అంటూ అంటూ చెవిని ఘంటంతో గోకుతూ మరీ పోరుపెట్టాడు.

మరీ చిన్నా, చితకా తపస్సులకే తను ప్రత్యక్షం అయితే, అది ప్రిస్టేజ్ మ్యాటర్ అని ఫీలై... వరుణదేవుడ్ని పిలిచి వర్షాన్ని కురిపించడం, రెయిన్ కోటు ఎఫెక్ట్‌వల్ల బ్రమానందం సేఫవ్వడం, సూర్యుడిని పిలిచి మండిపొమ్మని చెప్పడం, తపస్సు చేసేది చెట్ల మధ్య కావడంవల్ల బ్రమానందానికి ఏమీ కాకపోవడం, చలి పులితో ఎటాక్ చేయించాలని ప్రయత్నించడం స్వెట్టర్‌వల్ల బ్రమానందానికి వెచ్చగానే వుండడం...



"ఇలా కాదు... వెళ్ళి వరమిచ్చి వచ్చేయండి" చిత్రగుప్తుడు మొత్తుకున్నాడు.

యముడికీ థ్రిల్లుగానే వుంది. ఇన్ని వేల సంవత్సరాలుగా ఇన్ని యుగాలుగా ఎవరూ తన గురించి తపస్సు చేయలేదు. ఈ అవకాశం వదులుకోకూడదు. అనుకొని వెంటనే బ్రమానందం ముందు ప్రత్యక్షమయ్యాడు.

"బ్రమానందం భక్తా ఏమి నీ కోరిక?" అడిగాడు యముడు.

"మీరు ఒరిజనల్ యముడేనా?" చిన్న డౌట్‌తో అడిగాడు బ్రమానందం.

'ఏమా పిచ్చి చచ్చు ప్రశ్న... గదతో ఒక్కటిస్తే బొందితో నరకానికి వెళ్తావు" యముడు హుంకరించాడు.

'అయ్యో... ఎంత మాట... సాక్షాత్తు ఒరిజినల్ యముడే కనిపించేసరికి టంగ్ స్లిప్పయింది' అన్నాడు సాష్టాంగ పడిపోతూ బ్రమానందం.

"నరుడా... ఏమి నీ కోరిక?" అడిగాడు యముడు.

ఒక్క క్షణం విచారంగా మొహం పెట్టి "నాకు చాలా బాధగా వుంది యమదేవా. మానవులు స్వార్థపరులు. నిన్నే రోజైనా పూజించారా? నీ గురించి తపస్సు చేసారా? అసలు నువ్వు లేకుండా మనుష్యులు గిట్టగలరా?"

"లెస్స బలికావు...కోరిక ఏమిటో చెప్పు మానవా?" అడిగాడు యముడు.

"హిరణ్య కశ్యపుడిలా గడపవతల, ఇవతల, ఆకాశంలో నేలమీద... లాంటి వరాలు అడగను. భస్మాసురుడిలా నెత్తిన చేయిపెడితే భస్మమవ్వాలని లాంటి కోరికలు కోరను... నేను చిరంజీవిగా వుండాలని కోరుకోను."

"మరి... నీకేం కావాలి... కొంపదీసి యమ పదవిపై కన్ను వేసావా? కళ్ళు పెకిలించి వేస్తాను". కోపంగా అన్నాడు యముడు.

"హెంతమాట... మరేమీ లేదు... ఆయుష్షు ఎప్పుడు తీరును?"

"అది బ్రహ్మ రహస్యం... అయిననూ నా గురించి తపస్సు చేసావు కాబట్టి చెబుతున్నాను. పెళ్ళయిన సంవత్సర కాలానికి నా కాలం చెల్లును. టీవీలో ఓ డైలీ సీరియల్ చూచుచున్న నీ భార్యను అన్నం వడ్డించమని అని నువ్వు అన్న కారణంగా ఆ కోపంతో రిమోట్ అను సాధనంతో నీ భార్య నీ తలపై బాదడంవల్ల చచ్చి... నాతో యమపురికి వస్తావు" అతని లలాటంపై వున్న అతని తల రాతను చదివి చెప్పాడు యముడు.

నాదో చిన్న కోరిక... నేనో డైలీ టీవీ సీరియల్ తీయ సంకల్పించాను. అది పూర్తయిన పిదప నేనే నీ దగ్గరికి వస్తాను. అప్పటివరకూ నువ్వు నా దగ్గరికి రాకూడదు. ఇదే మీరు నాకు యిచ్చు వరం" వినయంగ చెప్పాడు భ్రమానందం.

"టీవీ సీరియల్ పూర్తయిన పిదప వచ్చుటకు అభ్యంతరం లేదు కదా."

"లేదు యమదేవా."

'ఇంకా నయం... మృత్యుంజయ వరం అడుగుతావేమో బ్రహ్మదేవుడితో కయ్యం మొదలగునేమోనని భయపడ్డాను. తథాస్తు... టీవీ సీరియల్ పూర్తయిన పిదప యమపాశం నీ ప్రాణం హరించును. జ్ఞప్తికి వుంచుకొనుము అని స్పెషల్ ఎఫెక్ట్‌లో మాయమయ్యాడు యముడు.

అలా మొదలయ్యాయి యమ పాట్లు.

* * *

భ్రమానందం బాగా ఆలోచించి... చించి డైరెక్టర్ నిర్దయరావు దగ్గరికి వెళ్ళాడు.

"నాకో మాంచి డైలీ సీరియల్ తీసిపెట్టాలి. అది... తప్ప అంతం లేని సీరియల్ కావాలి" చెప్పాడు.

"ఓస్... అంతేనా... నా మరదలు చాపెక్కినప్పుడు ఓ సీరియల్ మొదలుపెట్టాను. మా పెళ్ళయింది. నాకో కూతురు పుట్టింది. మొన్ననే అత్తారింటికి వెళ్ళింది. నా సీరియల్‌లో ప్రెగ్నెంటైన హీరోయిన్ యింకా డెలివరీనే కాలేదు" చెప్పాడు నిర్దయరావు.

భ్రమానందం కళ్ళు ఎలక్ట్రిక్ బల్బుల్లా వెలిగాయి.

"నువ్వే నా సీరియల్‌కు డైరెక్టర్‌వి. స్టార్ట్... కెమెరా... యాక్షన్" అని అరిచాడు.

* * *

"మన సీరియల్‌కు మంచి కథ కావాలి కదా..." అడిగాడు అమాయకంగా భ్రమానందం.

ఓ అరగంట... గంట... గంటన్నర సేపు పడీపడీ నవ్వి నవ్వి బుగ్గలు నొప్పెట్టి, పొట్ట బరువెక్కి పొర్లిపొర్లి నవ్వి లేచి కూచొని ఆయాసం తీర్చుకొని చెప్పాడు.

"డైలీ టీవీ సీరియల్‌కు కథేమిటి?"

"అంటే".

"అంటే ఏమీ లేదు. అంతా భ్రమ... భ్రమానందం ఎప్పుడు మూడ్ వస్తే అప్పుడు ట్విస్ట్."

"మరి ఆర్టిస్టుల డేట్లు".

డేట్లు, పాట్లు ఏమీ వుండవు... ఆర్టిస్టు రాలేదనుకో. ఏ యాక్సిడెంటో అయిందనిపించి ప్లాస్టిక్ సర్జరీ చేయించి మరొకర్ని చూపిస్తాం అర్థం చేసుకోవు.

మెల్లమెల్లగా భ్రమానందానికి అర్థమవుతోంది.

* * *

షూటింగ్ మొదలైంది. అరడజను ఆర్టిస్టులు వచ్చారు. ఫస్ట్‌షాట్ పూర్తయింది. నిర్దయరావు ఓ అరగంట కునుకు తీసాడు. అరడజను మంది ఆర్టిస్టులను వరుసగా నిలబెట్టి పేరేడ్‌కు నిలబెట్టినట్టు నిలబెట్టాడు.

'ఇప్పుడందరి క్లోజప్‌లూ తీసుకుంటాను. ఒక్కొక్కరు ఒక్కోలా మొహం పెట్టండి. ఛాయిస్ మీదే. రైట్ సైడ్ ఆర్టిస్టూ... మొహంలో బ్లాంక్‌నెస్ కనిపించాలి. ఇదిగో లెఫ్ట్‌సైడూ నీ మొహంలో కోపం... నీ మొహం సంతోషం"... ఇలా సజెషన్స్ యిచ్చాడు. కెమెరా రన్ అవుతోంది.

అమ్మాయి కాళ్ళు... చేతులు... పాల గ్లాసు... మార్చి మార్చి చూపిస్తాం... ఆ అమ్మాయి శోభనం గదిలోకి అడుగుపెట్టడం... భర్తను చూడ్డం... షాక్ అవ్వడం... ఇదంతా మూడు నెలల ప్రాసెస్. ఆ అమ్మాయికి ఫ్లాష్‌బ్యాక్ గుర్తొస్తుంది. అంతే...

మార్చి మార్చి... మార్చి మార్చి తీసాడు. తర్వాత ఓ కారును ఆ చివరి నుంచి ఈ చివరివరకు నడిపించి షూట్ చేసాడు. ఓ పాల గ్లాసుతో శోభనం గదిలోకి వెళ్ళమన్నాడు.

* * *

"హమ్మయ్య... మూడు ఎపిసోడ్లు పూర్తయింది" అన్నాడు డైరెక్టర్ నిర్దయరావు.

"అప్పుడేనా... షూటింగ్ మొదలెట్టి ఓ రెండు గంటలైనా కాలేదు. ఇది మూడ్రోజుల సీరియలా?"

"ప్చ్... ప్చ్... ప్చ్...అని మూడుసార్లు అని. ఆర్టిస్టుల ఫేస్‌ల మీద కెమెరా పెట్టాము... అది మార్చి మార్చి ఒక సీన్ మొత్తం చూపిస్తాం. తర్వాత కారు బయల్దేరుతుంది. అలా...అలా... కారు నడుస్తూనే వుంటుంది.

ఒకటే మలుపులు అలా... తిరిగి... తిరిగి... తిరిగి వస్తుంది. అదో ఎపిసోడ్ అయిపోతుంది.

అమ్మాయి కాళ్ళు... చేతులు... పాల గ్లాసు... మార్చి మార్చి చూపిస్తాం... ఆ అమ్మాయి శోభనం గదిలోకి అడుగుపెట్టడం... భర్తను చూడ్డం... షాక్ అవ్వడం... ఇదంతా మూడు నెలల ప్రాసెస్. ఆ అమ్మాయికి ఫ్లాష్ బ్యాక్ గుర్తొస్తుంది. అంతే... తన చిన్ననాటి సంగతులు. ఆ ఫ్లాష్‌బ్యాక్‌లో హీరోయిన్‌కు తల్లి గుర్తొస్తుంది. మళ్ళీ తల్లి ఫ్లాష్‌బ్యాక్... ఆ తల్లికి బాల్యం గుర్తొస్తుంది. ఆ ఫ్లాష్ బ్యాక్‌లో లేటెస్ట్ కారులో వెళ్ళే తన తల్లి గుర్తొస్తుంది. ఇలా ఓ వంద ఫ్లాష్ బ్యాక్‌లు... అయిపోయి... కథ మళ్ళీ శోభనం గదిలోకి వచ్చేసరికి ఓ పదేళ్ళు పడుతుంది.

ఆ తర్వాత వాళ్ళ శోభనం... ఆమెకు ప్రెగ్నెన్సీ... బారసాల... బాబు పుట్టడం... పాకడం... పెరిగి పెద్దవ్వడం... తండ్రి 'రా' అనడం... అతనికి పెళ్ళవ్వడం... భార్యకు, తల్లికి గొడవ... వెరైటీ ఫేజింగులు... ఇవన్నీ ఓ పదేళ్ళేస్కో... అత్త చనిపోతుంది. కోడలు అత్తవుతుంది. కొత్తగా కోడలి పోస్టులోకి కొడుకు భార్యొస్తుంది.

మళ్ళీ అత్తాకోడళ్ళ మధ్య వార్... అదో పదిహేనేళ్ళేస్కో... అలా.. అలా..."

"స్టాప్... స్టాపంటే స్టాపంటే... నాకర్థమైంది.. నా డైరెక్టర్ నువ్వే... నువ్వు పోతే నా కొడుకు.. వాడు పోతే వాడి కొడుకు... ఆ తర్వాత వాడి కొడుకు..." తెగ ఆనందంగా చెప్పుకుపోతున్నాడు భ్రమానందం.

"మరి మీరు పోరా?"

పోను... అది యమ రహస్యం మనసులో అనుకున్నాడు భ్రమానందం.

* * *

అలా భ్రమానందం సీరియల్ మొదలెట్టాడు. భ్రమానందానికి పెళ్ళయింది. యముడు తనెలా చస్తాడో చెప్పిన మీదట భార్య టీవీ సీరియల్ చూసే సమయంలో ఎప్పుడూ భార్యను డిస్టర్బ్ చేయలేదు. తనే వండుకు తినడం నేర్చుకున్నాడు.

భ్రమానందం తీస్తోన్న టీవీ సీరియల్ మొదలైంది. రోజులు... నెలలు... సంవత్సరాలు... ఇంకా కథ ప్రారంభమే కాలేదు.. ఈలోగా భ్రమానందానికి పిల్లలు పుట్టడం, పెద్దవ్వడం... వాళ్ళ పెళ్ళిళ్ళు అయిపోవడము పూర్తయింది.

డైరెక్టర్ చచ్చాడు. అతని కొడుకు డైరెక్టరై ముసలితనమొచ్చి, అతనూ చచ్చి నిర్దయరావు మనవడు డైరెక్టరయ్యాడు. అయినా భ్రమానందం చచ్చలేదు. తల పెండి బుట్టయినా సరే...

యముడికి చిర్రెత్తిపోతోంది. దేవుళ్ళంతా యముడి మీద విరుచుకుపడ్డారు. యముడి వరానికి తిరుగులేదాయె... భ్రమానందం డైలీ సీరియల్ కొ...న...సా...గు...తూ...నే వుంది.

* * *

యముడి వరానికి తిరుగులేదు. భ్రమానందం లాంటి వాళ్ళు తీసే డైలీ టీవీ సీరియల్స్‌కు అంతంలేదు. ప్రేక్షకుల సహనానికి సరిహద్దు లేదు.

ఇప్పుడప్పుడే భ్రమానందం చచ్చే సూచనలు లేవు. యముడు టీవీ సెట్‌ని యమలోకంలో పెట్టించి ఎప్పుడు భ్రమానందం సీరియల్ అయిపోతుంది. ఎప్పుడెప్పుడు అతడ్ని నరకానికి తీసుకువద్దామా... అని ఎదురుచూస్తున్నాడు. ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించిన భ్రమానందం ఖచ్చితంగా నరకానికే వస్తాడు.

* * *

ఈలోగా నరకమంతా టీవీ సీరియల్స్ ఎడిక్టయింది. యమ కింకరులు పాపులను పై చేయడం, శిక్షలు వేయడం మాని టీవీకి ఫెవికాల్‌లా అతుక్కుపోయారు.

చిత్రగుప్తుడికి సోకిన టీవీ మేనియావల్ల అతడి చిట్టాల లెక్కలు గతి తప్పుతున్నాయి.

సాక్షాత్తు యముడి అర్ధాంగి డైలీ టీవీ సీరియల్స్ చూస్తూ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

యముడు విలపిస్తున్నాడు... సీరియల్ ఎప్పుడెప్పుడు అయిపోతుందా... అని...

యముడి వరమా... మజాకా.

టీవీ సీరియల్స్‌తో గేములొద్దు.

ప్రేక్షకుల (శాల్తీల) మనశ్శాంతులు గల్లంతైపోతాయి.

అప్పుడప్పుడు యమధర్మరాజు నిద్రలో కూడా కలవరిస్తూనే వున్నాడు.

'నేనొప్పుకోనంతే'... అంటూ. ★